1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 147 గురువారం 04 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## గొడ్డలి పార్టీకి విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు



### సీఎం చంద్రబాబు ఫైర్

- డీఎస్సీ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని చంద్రబాబు స్పష్టీకరణ
- పేటీఎం బ్యాచ్‌లతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- యోగాంధ్ర కార్యక్రమానికి నిధుల కేటాయింపుపై విమర్శలను తప్పుబట్టిన సీఎం
- ప్రజలకు మంచి చేయడంలో పోటీ పడాలని రాజకీయ పార్టీలకు పిలుపు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 03)

ప్రత్యర్థి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప మరేమీ చేతకాదని, వారిని గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలే బహిష్కరించాలని పిలుపునిచ్చారు.డీఎస్సీ నియామకాలపై వస్తున్న విమర్శలపై చంద్రబాబు స్పందిస్తూ, "డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీకి టీడీపీ ఒక బ్రాండ్. అధికారంలోకి ▶మిగతా 2లో

## భారత్‌పై అమెరికా మరో బాంబ్.. 12.5శాతం అదనపు సుంకాలకు ప్రతిపాదన



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 03)

భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా మరోసారి సుంకాలతో విరుచుకుపడేందుకు సిద్ధమైంది. వెట్టిచాకిరీ నిర్మూలనలో విఫలమైనందుకు గానూ ఆ దేశాలపై అదనపు సుంకాలు విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రతిపాదించింది. భారత్‌తో పాటు మొత్తంగా 60 దేశాలపై ఈ సుంకాలు విధించాలని ఖుతీఅటటం ప్రతిపాదనలు చేసింది. ఇందులో అత్యధిక దేశాలపై 12.5శాతం, మిగతా వాటిపై 10శాతం సుంకం విధించాలని సూచించింది."వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులపై నిషేధం విధించి, వాటిని అమలుచేయడంలో పలు దేశాలు విఫలమయ్యాయి. మా వాణిజ్య భాగస్వామ్య దేశాలు కూడా దీనిని అరికట్టలేకపోవడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. వెట్టిచాకిరీ కారణంగా అంతర్జాతీయ లేబర్ మార్కెట్లో అమెరికా కార్మికులకు తీవ్ర పోటీ ఎదురవుతోంది. అసమానతలను మేం ఇక సహించలేం" అని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.ఈ ఆరోపణలకు సంబంధించి మొత్తం 60 దేశాలపై యూఎస్‌టీఆర్ దర్యాప్తు జరిపింది. అనంతరం 54 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకాలను ప్రతిపాదించింది. వీటిల్లో భారత్‌తో పాటు చైనా, జపాన్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, యూకే, సౌదీ అరేబియా తదితర దేశాలున్నాయి. ఇక, కెనడా, ఈక్వెడార్, ఈయూ, ఇండోనేసియా, మెక్సికో, పాకిస్థాన్ దేశాలు నిషేధం విధించినప్పటికీ.. వాటిని సమర్థవంతంగా అమలు చేయలేకపోయాయని ఆరోపించింది. అందువల్ల ఆయా దేశాలపై 10శాతం అదనపు సుంకాలు విధించాలని ప్రతిపాదించింది. ▶మిగతా 2లో



## ముర్ము, రాధాకృష్ణన్‌లతో దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడి భేటీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 03)

భారత్‌లో తన అధికారిక పర్యటనలో భాగంగా దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు షిపోకోసా పాలస్ మషటైల్ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఉన్న 15.5 బిలియన్ డాలర్ల (రూ.1,47,698 కోట్లు) వాణిజ్యాన్ని ప్రస్తావిస్తూ ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను ఉన్నతస్థాయికి ▶మిగతా 2లో

## ఆ ఛాన్స్ లేక స్పోర్ట్స్ కోటాపై పడ్డారు



### ఏపీ హోంమంత్రి అనిత

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 03)

డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఏ ఆత్మ చెప్తే.. జగన్ 9 నెలల తర్వాత విషప్రచారం మొదలుపెట్టారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. ప్రజలకు అర్థమయ్యేలా సమాధానాలు చెప్తామని, విష ప్రచారాలను కట్టడి చేస్తామని తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు ఉంటాయని వెల్లడించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిలో అత్యధిక శాతం తెదేపా ప్రభుత్వంలో నియమితులైన వారేనని చెప్పారు. ▶మిగతా 2లో

## పవన్‌పై వ్యాఖ్యలు కరెక్ట్ కాదు..

### తెలంగాణ నేతలకు చంద్రబాబు హితవు

- తెలంగాణలో పవన్ పై వ్యాఖ్యలను ఖండించిన సీఎం చంద్రబాబు
- విద్వేషాలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం సరైన పద్ధతి కాదు
- రాష్ట్రం విడిపోయి 12 ఏళ్లయ్యాక అనవసర వివాదాలు తగదు
- అభివృద్ధి, ప్రజాసేవలో పోటీ పడాలని రాజకీయ నాయకులకు పిలుపు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 03)

తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ఇలాంటి మాటలతో అనవసర సమస్యలు ▶మిగతా 2లో



## ఢిల్లీ అగ్ని ప్రమాదంపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

- ఢిల్లీలోని రెస్టారెంట్‌లో ఘోర అగ్ని ప్రమాదం
- ప్రమాదంలో 21 మంది దుర్మరణం
- అత్యంత బాధాకరం అన్న జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 03)

ఢిల్లీలో జరిగిన ఘోర అగ్ని ప్రమాద ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఒక రెస్టారెంట్‌లో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఏకంగా 21 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు జగన్ తన ప్రగాఢ ▶మిగతా 2లో



## నెహ్రూ రికార్డు బద్దలు..

### సుదీర్ఘకాలం పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!

- జూన్ 10 నాటికి ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకోనున్న మోదీ
- 4,398 రోజుల పాటు పాలించిన నేతగా ఇప్పటి వరకు నెహ్రూ పేరిట రికార్డు
- 4,077 రోజులు అధికారంలో ఉన్న ఇందిరా గాంధీ
- అత్యధిక కాలం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ పేరిట రికార్డు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 03)

భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన మైలురాయిని అందుకోనున్నారు. దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానిగా జూన్ 10న ఆయన సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న దశాబ్దాల నాటి రికార్డును మోదీ అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ.. జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు.దేశంలో మొదటి సాధారణ ఎన్నికల తర్వాత 1952 మే 13న నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1964 మే 27న మరణించే ▶ 2లో

## ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే లాభం ఉండదు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 03)

ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే ఏ వ్యవస్థ అయినా మనుగడ సాగిస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో లలిత పీవీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో చంద్రబాబు పాల్గొన్నారు. ▶ 2లో

## మక్కల కొనుగోళ్లతో రూ.400 కోట్ల భారం



(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్,జూన్ 03)

మొక్కజొన్న కొనుగోళ్లపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో రాష్ట్రంపై భారీగా అదనపు భారం పడుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు, రవాణా, నిల్వ, నిర్వహణ తదితర వ్యయాలను కలుపుకొని ప్రభుత్వం టన్నుకు రూ.29,272 చొప్పున ఖర్చు చేసిందని, విక్రయాల్లో ఆ మేరకు ధర రాకపోవడంతో ఒక్క వానాకాలం సీజన్‌లోనే రూ.400 కోట్ల నష్టం వచ్చిందని తెలిపారు. కేంద్రం ధాన్యం మాదిరిగానే మొక్కజొన్నను సేకరించకపోవడమే దీనికి కారణమన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు ▶మిగతా 2లో

## విశాఖ-కాకినాడ తీరంలో భారీ కెమికల్ ప్లాంట్.. రష్యా దిగ్గజానికి లోకేష్ ఆహ్వానం

- రష్యా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్
- ప్రముఖ రసాయన సంస్థ రస్ కెమ్ గ్రూప్‌తో కీలక సమావేశం
- విశాఖ-కాకినాడ తీరంలో కెమికల్ ప్లాంట్ ఏర్పాటుకు ఆహ్వానం
- పోర్టు ఆధారిత లాజిస్టిక్స్ హబ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి
- లోకేష్ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చిస్తామన్న రస్ కెమ్ ప్రతినిధులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 03)

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని ▶మిగతా 2లో

## రోడ్లపైకి 5,500 విద్యుత్ బస్సులు



(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్,జూన్ 03)

ఆర్టీసీలో కాలం చెల్లిన, ఎక్కువ కిలోమీటర్లు తిరిగిన బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. దశలవారీగా మొత్తం 6వేల బస్సులు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా, ఇందులో విద్యుత్ బస్సులు 5,500, సీఎన్‌జీ బస్సులు 500 ఉంటాయి. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సిటీ బస్సుల్లో కాలం చెల్లినవి ఏవేవి ఉన్నాయో, వాటి స్థానంలో విద్యుత్ బస్సులను అవే సర్వీసులుగా నడపనున్నారు.

2

## మొదటి పేజీ తరువాయి

## గొడ్డలి పార్టీకి విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు

రాగానే తొలి సంతకంతో పారదర్శకంగా నియామకాలు చేపట్టాం. స్పోర్ట్స్ కోటాపై కనీస అవగాహన లేకుండా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే కేటగిరీలు నిర్ణయించి ఉద్యోగాలు ఇచ్చాం" అని వివరించారు. కొందరు తమ పేటిఎం బ్యాచ్‌ల ద్వారా ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలు ఏ అంశంపైనైనా మాట్లాడే ముందు అధ్యయనం చేయాలని హితవు పలికారు. "యోగాంధ్ర కార్యక్రమం కోసం రూ.10 కోట్లు కేటాయిస్తే దానిపైనా విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ నిర్మాణాత్మక నిర్ణయం తీసుకున్నా బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.విభజన జరిగి 12 ఏళ్లు గడిచిపోయిందని, ఈ సమయంలో ప్రజలకు ఎవరు మంచి చేశారో అందరికీ తెలుసని చంద్రబాబు అన్నారు. అనవసర వివాదాలు సృష్టించడం మానుకుని, ప్రజలకు మేలు చేయడంలో రాజకీయ పార్టీలు పోటీ పడాలని ఆయన సూచించారు.

## భారత్‌పై అమెరికా మరో బాంబ్..

## 12.5శాతం అదనపు సుంకాలకు ప్రతిపాదన

ఈ సుంకాలపై చర్చించేందుకు ఆయా దేశాలు జూన్ 22లోగా తమను సంప్రదించొచ్చని సూచించింది.

**అమెరికాతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి..**

మరోవైపు, వెట్టిచాకిరీ అంశంలో అమెరికా విధించిన సుంకాలపై భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందించింది. సెక్షన్ 301 దర్యాప్తు విషయంలో అగ్రరాజ్యంతో సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించింది. అటు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అంశంపైనా సమాంతర చర్చలు జరుగుతున్నాయని వెల్లడించింది. సెక్షన్ 301 కింద ప్రతిపాదించిన సుంకాలు ఇంకా ఖరారు కాలేదని తెలిపింది. జూన్ 22 వరకు సంప్రదింపులకు అవకాశం ఉందని, జులై 6 వరకు లిఖితపూర్వకంగా అభిప్రాయాలు తెలియజెప్పేందుకు సమయం ఉందని పేర్కొంది. ఆపై తుది నిర్ణయం ఉంటుందని పేర్కొంది.

## మక్కల కొనుగోళ్లతో రూ.400 కోట్ల భారం

కేంద్రాల ద్వారా రైతుల నుంచి మొక్కజొన్నను సేకరిస్తున్నాం. వానాకాలంలో సేకరించిన వాటిని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా వేలం నిర్వహించి విక్రయించింది. మేము రైతుల కోసం రూ.వేల కోట్ల ఆర్థికభారం భరిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా తన బాధ్యతను నిర్వర్తించాలి. యాసంగిలో సేకరించిన మొక్కజొన్నలనైనా నాఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ధరకే సేకరించాలి. జొన్న, పొద్దుతిరుగుడు పంటలను కూడా ధరల మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలి' అని కోరారు. రాష్ట్రంలోనే అతిపెద్దదైన వరంగల్ ఎనుమాముల మార్కెట్‌యార్డుకు 16 మందితో పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## విశాఖ-కాకినాడ తీరంలో భారీ కెమికల్ ప్లాంట్..

## రష్యా దిగ్గజానికి లోకేష్ ఆహ్వానం

విశాఖ–కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి" అని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ప్లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.

## ఆ ఛాన్స్ లేక స్పోర్ట్స్ కోటాపై పడ్డారు

డీఎస్సీపై వైకాపా ఆరోపణల నేపథ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. "డీఎస్సీ పోస్టింగ్ అనేది ఎన్నో కుటుంబాలకు ఎమోషనల్ బాండింగ్. ఏ కోర్టు కేసూ అడ్డంకి రాకుండా అన్ని సమస్యలు పరిష్కరించి గౌరవప్రదంగా ప్రతి ఒక్కరికీ నియామక పత్రాలు అందజేశాం. ప్రశ్నపత్రాల లీక్‌కు అవకాశం లేకపోవటంతో స్పోర్ట్స్ కోటాపై పడ్డారు. గొడ్డలి పార్టీ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆ పార్టీ నేతలకు సమస్యనే కావాలి.. సమాధానం కాదు. వైకాపా అధికారంలో ఉండగా 2022లో తెచ్చిన హారిజాంటల్ రిజర్వేషన్ ఆధారంగానే డీఎస్సీ నియామకాలు జరిగాయి. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు పెట్టిన మహామహులు బ్రిడ్జ్ స్పోర్ట్స్‌పై అవగాహన లేమితో మాట్లాడుతున్నారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ అంటే గొడ్డలి పార్టీ నేతలు నిర్వహించిన జూద శిబిరాలు కాదు"అని మంత్రి అనిత మండిపడ్డారు.

## ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే లాభం ఉండదు

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లలిత ఆసుపత్రి.. ల్యాండ్ మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు."ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభం ఉండదు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు. వేల కోట్లు, పదవులు ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. లలిత ఆసుపత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైంది. 32 విభాగాలకు వైద్య సేవలు అందించే ఏకైక కేంద్రమిది.సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టును తీసుకొస్తున్నాం. పేదవాళ్ల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మంచి అలవాట్లతో అనారోగ్యం మన దరి చేరదు. యోగా, ధ్యానం వంటి వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మనం తినే ఆహారమే.. మన ఆరోగ్యాన్ని రక్షిస్తుంది" అని చంద్రబాబు తెలిపారు.

## రోడ్లపైకి 5,500 విద్యుత్ బస్సులు

**జులై నుంచి మొదలు..** ప్రధానమంత్రి ఈ–బస్ సేవ పథకం కింద 750 విద్యుత్ బస్సులు రాష్ట్రానికి కేటాయించారు. వీటిని 11 నగరాల్లోని 12 డిపోల పరిధిలో అద్దె ప్రాతిపదికన నడుపుతారు. వీటిలో 300 బస్సులు జులైలో రోడ్డెక్కనున్నాయి. ఆగస్టులో మిగిలిన 450 రానున్నాయి. తిరుమల ఘాట్‌లో డీజిల్ బస్సుల స్థానంలో నడిపేందుకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ 300 విద్యుత్ బస్సులు మంజూరుచేసింది. ఇతర నగరాల్లో తీసుకునే విద్యుత్ బస్సులు 12 మీటర్ల పొడవుతో ఉండగా, ఘాట్‌లో నడిపేవి 9 మీటర్ల పొడవుతోనే ఉంటాయి. వీటికి కేంద్రమే టెండర్లు పిలిచింది. ఈ వారంలో వాటిని తెరవనున్నారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ విధానంలో 1,450 విద్యుత్ బస్సులు ఆర్టీసీ తీసుకోనుంది. దీనికోసం ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదన సిద్ధమైంది. జులై నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, వచ్చే ఏడాది మార్చి నుంచి విద్యుత్ బస్సులు పరుగులు పెట్టేలా చూడనున్నారు. పూర్వోదయ పథకం కింద కేంద్రం పలు రాష్ట్రాలకు విద్యుత్ బస్సులు కేటాయిస్తుండగా, అందులో ఏపీకి వెయ్యి బస్సులు ఇవ్వనుంది. గ్రామీణ ప్రాంతాలు, కొంత దూర ప్రాంతాలకు నడిపేందుకు వీలుగా మరో 2 వేల బస్సులను పీఎం ఈ–డ్రైవ్ పథకం కింద తీసుకోనున్నారు. ఈ ప్రతిపాదన కేంద్రం వద్దకు వెళ్లింది. సీఎన్‌జీ అందుబాటులో ఉన్న నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 500 సీఎన్‌జీ బస్సులు ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. సీఎన్‌జీ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు.

**ఇప్పుడున్న బస్సుల రంగులే..** పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి బస్సులకు ఇప్పుడున్న రంగులే.. విద్యుత్ బస్సుల్లో కూడా ఉంటాయని, దీనివల్ల ప్రయాణికులకు ఎటువంటి గందరగోళం ఉండదని అధికారులు చెబుతున్నారు.

## ముర్ము, రాధాకృష్ణన్‌లతో దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడి భేటీ

తీసుకువెళ్లేందుకు ఇరు దేశాలు కృషి చేయాలని ముర్ము సూచించారు. భారత్ – ఆఫ్రికా ఫోరం శిఖరాగ్ర సమావేశాన్ని త్వరగా పునఃప్రారంభించేందుకు ఆఫ్రికన్ యూనియన్ కమిషనుతో కలిసి భారత్ సన్నిహితంగా పనిచేస్తుందన్నారు. ఇరు దేశాల కంపెనీలు పరస్పర వ్యాపార, పెట్టుబడులతో మరింత విస్తరించేందుకు వీలు కల్పించే అనుకూలమైన విధాన వాతావరణాన్ని కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి భవన్‌లో వీరి భేటీ జరిగింది. ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్‌తోనూ షిపోకోసా సమావేశమయ్యారు. 'ప్రాజెక్టు చీతా'కు దక్షిణాఫ్రికా అందిస్తున్న సహకారాన్ని రాధాకృష్ణన్ అభినందించారు. షిపోకోసా వెంట సీనియర్ మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో కూడిన ప్రతినిధి బృందం భారత్‌కు వచ్చింది.

## ఢిల్లీ అగ్నిప్రమాదంపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

సానుభూతిని తెలియజేశారు. అలాగే, ప్రమాదం కారణంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ అగ్నిప్రమాద బాధితుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు వస్తున్న వార్తలు మరింత కలచివేస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## నెహ్రూ రికార్డు బద్దలు..

వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ దాటనున్నారు. అంతకుముందు 2025 జులై 25న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరిట ఉన్న 4,077 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోదీ దాటేశారు.

నెహ్రూ కాలంతో పోలిస్తే ప్రస్తుతం దేశ జనాభా, ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. తొలి సాధారణ ఎన్నికల సమయంలో దేశ జనాభా 34 కోట్లుగా ఉండగా ఓటర్లు 17 కోట్లు మాత్రమే. మోదీ ప్రధాని అయ్యే నాటికి జనాభా 131 కోట్లకు చేరి ప్రస్తుతం 146 కోట్లు దాటింది. అలాగే 1952 ఎన్నికల్లో కేవలం 53 పార్టీలు పోటీ చేయగా.. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి పోటీ చేసిన పార్టీల సంఖ్య ఏకంగా 744కు చేరింది.నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఏకైక ప్రధానిగా మోదీ నిలిచారు. కాంగ్రెసేతర ప్రధానిగా వరుసగా రెండుసార్లు పూర్తి మెజారిటీ సాధించిన రికార్డు కూడా ఆయనదే. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా కలిపి అత్యధిక కాలం (8,930 రోజులకు పైగా) అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ రికార్డు సృష్టించారు.

## బూత్ పరిధిలో సమస్యల పరిష్కారానికి అందరూ కలసికట్టుగా పని చేయాలి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 3)

బూత్ పరిధిలో సమస్యలను పరిష్కరించేందుకు కెఎస్ఎస్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేయాలని తమ్మడపల్లి గ్రామ యూనిట్ క్లస్టర్ ఇన్‌ఛార్జి కోనంగి నాగయ్య కోరారు. యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో యూనిట్ క్లస్టర్ ఇంఛార్జి కోనంగి నాగయ్య ఆధ్వర్యంలో యూనిట్ క్లస్టర్ సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక పై ప్రతి నెల మొదటి బుధవారం బూత్ స్థాయి సమావేశం జరుగుతుందని, పార్టీ కార్యకర్తలు అందరూ హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. పింఛన్, రోడ్లు నిర్మాణం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు సకాలంలో అందే విధంగా చూడాలని సూచించాడు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సుందరయ్య దొర, తమ్మడపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు గంజి లింగారెడ్డి, గుర్రపుశాల ఎంపీటీసీ పల్లె చిన్న దేవయ్య, టిడిపి సీనియర్ నాయకులు మామిళ్ల ఏసు, గుండపునేని గండీరయ్య, తమ్మడపల్లి, గుర్రపుశాల, గంగుపల్లి బూత్ ఇన్‌ఛార్జిలు, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి ఆరోగ్యం తెలుసుకోండి పంటలు దిగుబడి పెంచుకోండి

### కృషి విజ్ఞాన కేంద్రం, కీటీక శాస్త్రవేత్త డాక్టర్ తూము వెంకటేశ్వర్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జూన్ 3)

రైతులు తమ వ్యవసాయ భూములలో పంటలు దిగుబడులను పెంచుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ తూము వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన తాళ్లూరు మండలం రజానగరం గ్రామంలోని శాస్త్రీయ పద్ధతుల ఎస్సీ రైతులు, కౌలు రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించే భూసార పరీక్షలు ద్వారా భూమిలోని పోషక పదార్థాల స్థాయిని తెలుసుకొని అవసరమైన ఎరువులను సరైన మోతాదులో వినియోగించుకోవచ్చు అని తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం భూసార పరీక్షల నిపుణులు జిసిహెచ్ నారాయణ మాట్లాడుతూ రైతులకు మట్టి నమూనాలను సేకరించు విధానం, భూసార పరీక్షలు, ప్రయోజనాలు, సమతుల్య ఎరువుల వినియోగాలు, ఖర్చులను తగ్గించి అధిక దిగుబడులు సాధించే మార్గాల పై ప్రతి రైతు తన భూమికి కనీసం మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా నాణ్యమై పంటల నాణ్యతను, ఉత్పాదకతను మెరుగుపరుచుకోవచ్చని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయిలోని రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తదుపరి భూసార పరీక్ష కొరకు మట్టి నమూనాలు తెలియజేసి, కొంత మంది దగ్గర మట్టి, నీరు సేకరించి కృషి విజ్ఞాన కేంద్రం ల్యాబ్‌కు పంపించారు.

# వ్యర్థాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు


(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 3)

వ్యర్థాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పిలుపునిచ్చారు. ' ఆపరేషన్ క్లీన్ స్వీప్ ' కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 60 అడుగుల రోడ్డులో ఉన్న పోతురాజు కాలువను శుభ్రం చేసే పనులను అధికారులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొని పూడికతీత పనులను పరిశీలించారు. ఘన వ్యర్థాల నిర్వహణ గురించి ప్రజలకు ఈ సందర్భంగా ఆయన అవగాహన కల్పించారు. ' ఆపరేషన్ క్లీన్ స్వీప్ ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య నిర్వహణ పై నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తొలి వారం రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్రస్తుతం రెండవ వారం మురుగు కాలువల నిర్వహణపై దృష్టి పెట్టామన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను రూపొందించిందన్నారు. ఆ నిబంధనలు అమలు చేసేందుకే ప్రతివారం ఈ విధమైన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వ మార్గనిర్దేశం మేరకు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను కాలువల్లో పడవేయొద్దని ప్రజలకు సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ తరపున చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యత నిర్వహించి పారిశుధ్య నిర్వహణలో అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు. పరిశుభ్రత వలన ఆరోగ్యము, ప్రత్యేక గౌరవం లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, అసిస్టెంట్ కమిషనర్ రామ్ భూపాల్‌రెడ్డి, మెప్మా పిడి విజయలక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ ఐషయ్య, ఇతర అధికారులు, స్థానిక ప్రముఖులు, ఐటీసీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల గురించి రూపొందించిన కరపత్రాలను ఈ సందర్భంగా వారు ఆవిష్కరించారు.









ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

04.06.26 గురువారం


# రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 3)

రెవెన్యూ సమస్యలపై వచ్చే ఆర్జీలను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలన చేసి నిర్ణీత గడువులోగా సహేతుకంగా పరిష్కరించి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశిలతో కలిసి కందుకూరు, అద్దంకి డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో సమావేశమై పిజిఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు, రెవెన్యూకు సంబంధించిన ఐవిఆర్ఎస్ కాల్స్, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, నిషేధిత 22(ఏ) భూములు, జీరో ఖాతాలు, ఇతర రెవెన్యూ అంశాల పైనా సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీచేసారు. ఉదయం కందుకూరు డివిజన్, మధ్యాహ్నం అద్దంకి డివిజన్ పరిధిలో మండలాల వారీగా రెవెన్యూ సమస్యల పరిష్కార పురోగతి పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి రెవెన్యూ సమస్యల రహిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా ప్రతి రెవెన్యూ అధికారి పనిచేయాల్సిన అవసరం ఉందని, నిర్లక్ష్యానికి తావులేదన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే ఆర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని రెవిన్యూ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఆర్జీల పరిష్కరించడంపై లేదా తిరస్కరించడంపై ప్రధానంగా ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోందని చెప్పారు. పరిష్కారం అయ్యే సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం చేయలేనివాటికి సంబంధించి, అర్జీదారులకు ప్రభుత్వ నిబంధనలను వివరిస్తూ ఏ కారణాలవల్ల వారి సమస్య పరిష్కారం కావడంలేదో సమగ్రంగా తెలియజేయాలని చెప్పారు. అర్జీదారులకు సమగ్ర వివరాలతో నోటీసు అందించి, వారి సంతకం తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా మాట్లాడాలని సూచించారు. దీనికోసం రెవెన్యూ అధికారులు తమ దృక్పథాన్ని మార్చుకొని, సానుకూల దృష్టిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూ ఆక్రమణలపై ఉదాసీనంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పై వచ్చే అర్జీల పట్ల వీఆర్వోలు వ్యవహరిస్తున్న తీరును తహసిల్దార్లు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. మ్యుటేషన్లు, కుల, మరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా మంజూరు చేయాలన్నారు. రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో వచ్చే నెలకు గణనీయమైన పురోగతి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మ్యుటేషన్లు, పాస్ పుస్తకాల ఈ కేవైసీ, పంపిణీలో ప్రతి వారం పురోగతి ఉండాలనన్నారు. జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పై, రెవెన్యూ సేవల పై వచ్చే అర్జీల పై సంబంధిత రెవెన్యూ అధికారి (తరువాయి 4లో...)

# ఫలించిన ఎమ్మెల్యే దామచర్ల కృషి

### కె పల్లెపాలెం ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి రూ.441.88 కోట్లు జీవో విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి దామచర్ల కృతజ్ఞతలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 3)

ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. కొత్తపట్నం మండలం కె పల్లెపాలెం వద్ద ప్రతిష్ఠాత్మక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.441.88 కోట్ల నిధులను మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ నిధుల సాధనలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు చేసిన నిరంతర కృషి ఫలించిందని మత్స్యకారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహానికి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం అవసరమని భావించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు గత కొంతకాలంగా ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేకంగా కృషి చేశారు. పలుమార్లు సంబంధిత శాఖల అధికారులతో పాటు ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం రూ.441.88 కోట్లతో ప్రాజెక్టుకు ఆమోదం తెలపడంతో కొత్తపట్నం మండలం రూపు రేఖలు మారనున్నాయని, మత్స్యకారులకు ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే దామచర్ల పేర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, అలాగే ప్రాజెక్టు ఆమోదానికి సహకరించిన అధికారులకు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని ప్రాజెక్టులు తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు.

# స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పై శిక్షణ నిర్వహించాలి

### వీడియో సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 3)

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, (తరువాయి 4లో...)

# పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించిన వెల్ఫేర్ సెక్రటరీ సస్పెండ్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 3)

ఒంగోలు మున్సిపాలిటీ పరిధిలోని దిబ్బల రోడ్డు సచివాలయంలో వార్డ్ వెల్ఫేర్, డెవలప్మెంట్ సెక్రటరీగా పని చేస్తున్న భీమవరపు సాయి కుమార్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ కమిషనర్ టి వెంకట కృష్ణయ్య బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పంపిణీ చేయడంలో విఫలం కావడంతో పాటు ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయటం, విధులలో నిర్లక్ష్యం వహించినట్లు కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు దృష్టికి వచ్చింది. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ విచారణ చేయించారు. వెల్ఫేర్ సెక్రటరీ సాయి కుమార్ పెన్షన్ల పంపిణీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతోపాటు నిర్లక్ష్యంగా కూడా ఉన్నట్లు అధికారులు నివేదించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సాయి కుమార్‌ను మున్సిపల్ కమిషనర్ సస్పెండ్ చేశారు.

# ప్రకృతి వ్యవసాయం పై రైతులు దృష్టి పెట్టండి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 3)

ఈ సంవత్సరం ఎల్ నిన్యో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం ఎల్ నిన్యో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి రైతులు వేయాల్సిన పంటలు, ప్రారంభించాల్సిన పద్ధతులకు సంబంధించి వ్యవసాయ శాఖ తయారు చేసిన పుస్తకాన్ని ఆ శాఖ అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. (తరువాయి 4లో...)



# మార్కాపురం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఏ కరీం పలువురు అభినందనలు

### ఎమ్మెల్యే కందులను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఈ కరీం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 3)

ఏపిసిపిడిసిఎల్ మార్కాపురం జిల్లాకు తొలి ఎస్ ఈ గా ఎస్ ఏ కరీం బుధవారం తనకార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ను ఈఈ నాగేశ్వరరావు, ఏడిఈ షియా నాయక్, పెద్దారవీడు ఏఈ రమేష్, జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు ఎస్ఈ ని మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి, శాలువాలతో (తరువాయి 4లో...)

# పట్టణంలో అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ





(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 3)
మండలంలోని పడమర కట్టకిందపల్లి గ్రామంలో "అంగన్వాడీ పిలుస్తోంది" ర్యాలీ కార్యక్రమాన్ని బుధవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీలో పార్వతి తల్లిదండ్రులను ఉద్దేశించి మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీలో చేర్పించాలని, అంగన్వాడీ ప్రత్యేకతలను తెలియజేసే నినాదాలు చేశారు. తదుపరి అంగన్వాడీ కేంద్రంలో తల్లిదండ్రులు, కార్యకర్తలతో పార్వతి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అంగన్వాడీ పిలుస్తోంది" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జూన్ 1 నుండి 20 తేది వరకు కార్యకర్తలు అందరూ ప్రతి ఇంటికి వెళ్లి అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు కల్పించే ప్రీ స్కూల్ విద్య, పోషకాహారం, ఆరోగ్య రక్షణ, భద్రత వంటి సేవలను గురించి, ప్రైవేటు పాఠశాలల కన్నా అంగన్వాడీలే మిన్న అని తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, వారిని ఒప్పించి మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలన్నారు. తదుపరి తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు తమ పిల్లలను అంగన్వాడికి పంపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ డి అనంతలక్ష్మి, ఆశ వర్కర్ పద్మ, వగ్గంపల్లి సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామంలోని తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు యన్‌టిఆర్ బెస్ట్ టీచర్ అవార్డు 2026 ప్రధానం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 3)
కొమరోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లినగరంలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేయుచున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు యన్‌టిఆర్ ట్రస్ట్ వారు ప్రదానం చేశారు. వీరు హిందీ విషయ నిపుణులుగా, స్టేట్ రిసోర్స్ పర్సన్ గా, టెక్స్ట్ బుక్ రైటర్ గా, డిస్ట్రిక్ట్ అకాడమిక్ ఫోరం మెంబర్‌గా, గత 20 సంవత్సరాల నుంచి హిందీ సబ్జెక్టులో 100 శాతం ఉత్తీర్ణత సాదించిన గురువుగా, అత్యాధునిక బోధనా పద్ధతులను పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయునిగా, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే దాతగా, సామాజిక స్పృహ కల్గిన ఉపాధ్యాయుగా, విద్యారంగ అభివృద్ధికి వీరు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యన్.టీ.ఆర్ ట్రస్ట్ వారు టీచర్స్ కేటగిరిలో బెస్ట్ టీచర్ అవార్డు ప్రదానం చేశారు.,ఈ అవార్డు ను విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ గారి చేతుల మీదుగా ఒంగోలులో ఈరోజు అందుకోనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు, బంధు-మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. తనకు ఈ అవార్డు రావడం ఆనందాన్ని కలిగించిందని డాక్టర్ పిచ్చయ్య తెలిపారు.

# రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్దిష్టమైన గడువులోపు పరిష్కరించాలన్నారు. ఆర్డీవో స్థాయిలో నిరంతర పర్యవేక్షణ ద్వారా రెవిన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తనతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఆమె చెప్పారు. ప్రజలతో వ్యవహరించే తీరు మర్యాదపూర్వకంగా ఉండాలన్నారు. స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమవుతున్నాయని, కుల, మరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేస్తే సహించనని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేసారు. నిషేధిత 22 (ఏ) భూములు, జీరో ఖాతాలు, ఇతర రెవెన్యూ అంశాలపైనా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్షించి మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో మాధురి, అద్దంకి ఆర్‌డిఓ విజయ జ్యోతి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పద్మశ్రీ, కందుకూరు, అద్దంకి డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.


# మార్కాపురం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఏ కరీం పలువురు అభినందనలు



ఘనంగా సత్కరించారు.
నూతనంగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎస్ఈ ఎస్ ఏ కరీం మార్కాపురం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా విద్యుత్ సమస్యల పట్ల పర్యవేక్షణ పెంచి నాణ్యమైన విద్యుత్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎస్ఈకి సూచించారు.
ఈ కార్యక్రమంలో మార్కాపురం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పై శిక్షణ నిర్వహించాలి




సిఇఓ వివేక్ యాదవ్ తో కలసి సమీక్ష నిర్వహించి, దిశా నిర్దేశం చేసారు. ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని, క్షేత్రస్థాయిలో బిఎల్ఓల పనితీరు పై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ వర్చువల్ సమావేశానికి ఒంగోలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా రెవెన్యూ అధికారి మాధురి, సంబంధిత కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం పై రైతులు దృష్టి పెట్టండి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో మొక్క దృఢంగా ఉండడంతోపాటు బెట్టను తట్టుకుంటుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి కొంతమంది సిబ్బంది కేటాయించినట్లు వివరించారు. వీరు రైతులకు వివిధ రకాల కషాయాలు తయారు చేయడం, ఘన, జీవామృతాలు తయారు చేసే విధానం చూపిస్తారన్నారు. దీర్ఘకాలిక పంటలు జోలికి వెళ్లకుండా పెసర, మినుము, సజ్జ, అలసంద వంటి పంటలు సాగు చేసుకుంటే రైతులు నష్టపోకుండా ఉంటారని వివరించారు. రసాయనాల వాడకం తగ్గిస్తే అన్ని పంటలకు బాగుంటుంది అని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ కెజి సుదర్శన్ రాజు, వ్యవసాయశాఖ జిల్లా ఇన్చార్జి అధికారి బాలాజీ నాయక్, ఎర్రగొండపాలెం ఏడిఏ రమణ, ఇతర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారం దిశగా ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యేక కృషి

## మంత్రి గొట్టిపాటి, సిఎండి పుల్లారెడ్డితో చర్చలు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 3)
కందుకూరు నియోజకవర్గంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించి ముందడుగు వేస్తున్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపిసిపిడిసిఎల్ సిఎండి పుల్లారెడ్డి లను బుధవారం విజయవాడలో కలిసి పలు అంశాల పై చర్చించడంతోపాటు వినతిపత్రం అందించారు. రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని కందుకూరు పట్టణం, పలుకూరు (కందుకూరు మండలం), చేవూరు (గుడ్లూరు మండలం), వెంగళాపురం (లింగసముద్రం మండలం) గ్రామాల పరిధిలో కొత్తగా 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్‌డిఎస్ పథకంలో భాగంగా కందుకూరు పట్టణంలో హైమాస్ట్ పోల్స్ (ఎత్తు స్తంభాలు) ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పలు మండలాల్లో కొత్తగా ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ అందుకు సంబంధించిన వివరాలతో వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తితో సిఎండి పుల్లారెడ్డి సానుకూలంగా స్పందించారు. రెండు, మూడు నెలల్లో అవన్నీ కచ్చితంగా మంజూరు చేస్తామని తెలిపారు.



# అక్షరాస్యుల పెంపే అక్షరాంధ్ర లక్ష్యం

## ఎంపీడీవో సురేష్ బాబు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 3)
మండలంలో 3,030 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉలవపాడు ఎంపీడీవో సురేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం ఉలవపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అక్షరాంధ్ర మండల కమిటీ సమన్వయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వహించిన సర్వే ప్రకారం మండలంలోని 16 సచివాలయాల పరిధిలో మొత్తం 6,050 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వయోజన విద్య పర్యవేక్షకులు శాతల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తొలి విడతలో 3,030 మందిని అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. లక్ష్యంగా ఎంపిక చేసిన వారందరినీ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు అక్షరాంధ్ర యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు చెప్పారు. అలాగే నిరక్షరాస్యులకు ఎంపికైన వాలంటీర్ టీచర్లచే జూలై మూడో వారంలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్‌తో పాటు వీడియో పాఠాల ద్వారా మొత్తం 100 గంటల శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి 2 రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో జగదీష్ బాబు, ఏపీఎం కృష్ణయ్య, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, వీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

## శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు













**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 3)**
బసవతారకం-ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణార్థం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్స్టిట్యూషన్ వారు, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఈ వైద్య శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైద్య శిబిరంలో ఉచితంగా మామోగ్రఫీ, అల్ట్రా సౌండ్, ప్రోస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, చెస్ట్ ఎక్స్ రే, బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సుమారు 200 మంది ఈ వైద్య శిబిరం నందు పాల్గొని, వైద్య సేవలు పొందారు.

**రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తా ఆదేశాల ప్రకారం..**
పోలీస్ డిపార్ట్మెంట్ వారి ఆరోగ్య సంరక్షణ భాగంలో ప్రకాశం, మార్కాపురం జిల్లా పోలీస్ సిబ్బందికి బుధ, గురువారం లలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలియజేశారు. ఈ రోజుల్లో క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా ప్రభలుతుందని, ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం వలన క్యాన్సర్ వ్యాధి నుండి బయటపడొచ్చు అని తెలియజేశారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి తదుపరి వైద్యం నిమిత్తం ఉపాస్ సూపర్ స్పెషాలిటీ నందు వైద్య సేవలు పొందవచ్చును అని తెలియజేశారు. ఈ వైద్యశిబిరం నిర్వహణకు సహకరించిన ప్రకాశం జిల్లా సర్వ సేవా సమితి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమాపతి చౌదరి మాట్లాడుతూ నిరంతరం ప్రజల రక్షణకై పాటుపడే పోలీస్ డిపార్ట్మెంట్ వారికి ఈ వైద్య శిబిరం ద్వారా వారి ఆరోగ్యాన్ని సంరక్షించే అవకాశాన్ని కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఆరోగ్య భద్రత సౌకర్యం కలదన్నారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వారికి అవసరమైన వైద్య సేవలు పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, ఒంగోలు వన్ టౌన్ వెంకటేశ్వరావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరి, సింగరాయకొండ సీఐ శ్రీహరి, ప్రముఖ మెదడు, నరాల వైద్య నిపుణులు డాక్టర్ పోకూరి శ్రీనివాస్, రేడియాలజిస్ట్ డాక్టర్ భరత్, యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్ పవన్ కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ రాధా, జనరల్ మెడిసిన్ డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాసులు, ఎనస్తీషియా అండ్ క్రిటికల్ కేర్ హెడ్ డాక్టర్ పవన్ కుమార్, ఇతర డాక్టర్లు అనీల్ కుమార్, పోకూరు శ్రీనివాసులు, జనరల్ మేనేజర్ ఆనంద్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసింసైదా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

## ఓ యువకుడు మృతి

## లారీలో భారీ మొత్తంలో బయటపడ్డ గంజాయి సంచులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)**
ఒంగోలు-నెల్లూరు జాతీయ రహదారి పై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లారీలో భారీ మొత్తంలో గంజాయి సంచులు పట్టుబడ్డాయి. పైన తవుడు గోతాలు పేర్చి లోపల గంజాయి సంచులు పెట్టారు. వివరాల్లోకి వెళితే రోడ్డు పక్కన ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను ఓ మోటారు బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో లోకేష్ అనే యువకుడు మృతి చెందాడు. ఒంగోలు కల్వరి టెంపుల్ దాటిన తర్వాత ఒక ఐషర్ వ్యాన్ బ్రేక్ డౌన్ కావడంతో డ్రైవర్ దానిని రోడ్డు పక్కకు నిలిపి ఉంచాడు. అదే సమయంలో బైక్ పై ఒంగోలు అరవపాలెం వైపు వెళ్తున్న లోకేష్ ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుండి బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన లోకేష్ తానే స్వయంగా బంధువులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి తరలించే లోపే లోకేష్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. సంఘటన స్థలానికి డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ఐషర్ వ్యాన్ తమిళనాడు రిజిస్ట్రేషన్‌తో ఉంది. అ వాహనాన్ని పరిశీలించగా పెద్ద మోతాదులో గంజాయి ఉందని ప్రాథమిక సమాచారంతో తమిళనాడుకు చెందిన స్పెషల్ టీం ఐచర్ (టిఎన్69 కె 7354) వ్యాన్ కోసం గాలింపు చేస్తూ ఆ వాహనాన్ని కనుగొని తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులకు స్పెషల్ టీం పోలీసులకు మధ్య కొంతసేపు వివాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. వ్యాన్‌లో ఉన్న వస్తువులకు సంబంధించి, ప్రమాద సమయం పై పోలీసులు పూర్తి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. గంజాయి ఉన్న లారీని ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.













## చిరు వ్యాపారుల ఆత్మవిశ్వాసం పీఎం స్వనిధి బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 3)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రారంభమైన పీఎం స్వనిధి (పీఎం స్వానిది ) యోజన వీధి వ్యాపారులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ఆర్థిక బలం అందిస్తోందని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ అన్నారు.ఈ పథకం ద్వారా లభించే ప్రయోజనాలను ఆమె ఈ సందర్భంగా వివరించారు. బ్యాంకు గ్యారంటీ లేకుండానే చిన్న వ్యాపారులకు సులభంగా రుణ సదుపాయం అందుతుందన్నారు. తీసుకున్న రుణాన్ని సమయానికి చెల్లిస్తే ప్రత్యేకంగా వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు.
డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక క్యాష్‌బ్యాక్, ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ ఈ పథకం దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తోందన్నారు. పీఎం స్వనిధి, 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' అనే నినాదంతో మోదీ ప్రభుత్వం దృఢ సంకల్పం తీసుకుందన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం, దేశ అభివృద్ధి కోసం నరేంద్ర మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని ఆమె అన్నారు.


## కుక్స్, హెల్పర్స్‌కు శిక్షణ కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జూన్ 3)**
మండల స్థాయి కుక్స్ అండ్ హెల్పర్స్‌కు ఒక రోజు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం బుధవారం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి 2 బి వీరరాఘవయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏజెన్సీ నిర్వాహకులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని పరిశుభ్రంగా వండి అందించాలని వారు సూచించారు. మాస్టర్ ట్రైనర్ ఏ శేషా వంటకాల తయారీలో పాటించాల్సిన మెళకువలు, పరిశుభ్రత ప్రమాణాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి అంజనీదేవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో అందించే కొన్ని వంటకాల తయారీ విధానాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, కుక్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

## 22 నుండి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు

### 26న శ్రీవారి కళ్యాణం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)**
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను జూన్ 22 వ తేదీ సోమ వారం నుండి 25 తేదీ గురువారం వరకు త్రయాహ్నిక దీక్షతో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. 26వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 లకు శ్రీవారి కల్యాణోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే పలు కార్యక్రమాలలో పాల్గొన దలచిన భక్తులు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

## శ్రేయ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రముఖ యాంకర్ ప్రియ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)

శ్రేయ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరిట ఒంగోలులోని సంఘమిత్ర ఆసుపత్రి ఎదుట ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ప్రముఖ యాంకర్ ప్రియ హెగ్డే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండి అగస్థిన్ బాబు మాట్లాడుతూ యాంకర్ ప్రియ హెగ్డే చేతుల మీదుగా కార్యాలయం ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే తిరుపతి, గూడూరు, విజయవాడ, గుంటూరులలో తాము స్వంత కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే అందరికీ అందుబాటులో ఉండే విధంగా తమ ఈ శ్రేయ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో వెంచర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యాంకర్ ప్రియా హెగ్డే మాట్లాడుతూ శ్రేయ ఇన్‌ఫ్రా డెవలపర్స్ వారి వెంచర్లో స్థలం కొనడం కంటే ఉత్తమమైన మార్గం లేదని, నమ్మకానికి మారు పేరు ఈ సంస్థ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్పౌస్ పెన్షన్ పంపిణీ చేసిన ముత్తుముల క్రిష్ణ కిషోర్



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 3)

కొమరోలు మండలంలో గత కొంతకాలంగా కొమరోలు సుబ్బారావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మరణించారు. సదరు విషయాన్ని సొసైటీ బ్యాంకు చైర్మన్ ముత్తుముల సంజీవరెడ్డి ద్వారా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకునివచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో స్పౌస్ పెన్షన్ వెంటనే మంజూరు చేయడం జరిగింది. బుధవారం ఈ స్పౌస్ పెన్షన్ సుబ్బారావు భార్య అయిన కొమరోలు లక్ష్మీకి తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొమరోలు మండల ప్రముఖులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దళిత నేత నీలం రాకతో యానాదుల స్థలం ఆక్రమణ పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

**తాళ్లూరు పోలీస్ స్టేషన్ ముందు యానాదుల ఆందోళన**
**దర్శి డిఎస్పి ఆదేశంతో వారం రోజుల తర్వాత**
**ఎస్సీ, ఎస్టీ కేసు కట్టిన తాళ్లూరు ఎస్ఐ**
**ఆరు నెలల్లో మొట్ట మొదటి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు**
**దళిత నేత నీలం నాగేంద్రరావు**





(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జూన్ 3)

దళిత నేత నీలం నాగేంద్రరావుతో తాళ్లూరు పోలీస్ స్టేషన్ ముందు యానాదుల ఆందోళనలతో ఎట్టకేలకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదయింది. తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన చేవూరి మౌనిక కుటుంబానికి సంబంధించిన 4.63 సెంట్ల స్థలంలో బీసీ కులానికి చెందిన కుర్చేటి శ్రీను కుటుంబ సభ్యులు ఒకటిన్నర సెంటు స్థలం మాదని చాలా కాలంగా ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలని దౌర్జన్యం చేస్తున్నారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక అగ్రకుల నాయకుల అండతో యానాదులను కులం పేరుతో దూషిస్తూ వారి రెండేళ్ల పిల్లవాడి కోసం ఏర్పాటుచేసిన దడిని లాగేసి వీరంగం సృష్టించారు మేము కొనుక్కున్న స్థలంలో మీకెందుకు ఒకటిన్నర సెంటు ఇవ్వాలి అంటూ మర్యాదగా మాకు ఒకటిన్నర సెంటు ఇవ్వకపోతే మిమ్మల్ని ఊరిలో ఉండనివ్వమని మీ ఇల్లు తగలపెడతామని బెదిరించారు. అంతట యానాదులు తాళ్లూరు పోలీస్ స్టేషన్ లో గత నెల 26వ తారీఖున ఫిర్యాదు చేశారు. కానీ తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జునరావు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయకుండా రాజి చేసే ప్రయత్నం చేశారు. బీసీ కులానికి చెందిన కురిచేటి శ్రీను కుటుంబ సభ్యుల నుండి సదరు భూమి జోలికి రాకుండా చేస్తానని హామీ ఇచ్చారు. అంతట తమకు న్యాయం చేయాలని బాధిత యానాదులు చేవూరి మౌనిక కుటుంబ సభ్యులు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ను ఆశ్రయించారు. నీలం నాగేంద్రరావు దర్శి డిఎస్పి బాలమురలీకృష్ణ దృష్టికి ఈ కేసు విషయమై ఫిర్యాదు చేశారు. దర్శి డిఎస్పి కేసు వివరాలు పరిశీలించి తాళ్లూరు వచ్చి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జునరావును రెండు రోజుల క్రితం ఆదేశించారు. కానీ స్థానిక తెలుగుదేశం నాయకుల మెప్పుకోసం తాళ్లూరు ఎస్సై మల్లికార్జున రావు కేసు కట్టలేదు. కేసు కడతానంటూ కాలయాపన చేశారు. అంతట నీలం నాగేంద్రరావు తాళ్లూరు పోలీస్ స్టేషన్ ముందు బాధిత యానాదులతో ఎస్సీ, ఎస్టీ కేసు కట్టాలంటూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఎటువంటి విచారణ జరపకుండానే ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను ఎస్సీ, ఎస్టీ కేసుగా కట్టాలని భారత ప్రభుత్వం జారీ చేసిన అమెండ్మెంట్ యాక్ట్ 2018 ప్రకారం తాళ్లూరు ఎస్ఐ కేసు కట్టాలన్నారు. అలాగే సుప్రీంకోర్టు లలిత కుమారి కేసులో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదును మొదట ఎఫ్ఐఆర్ చేసి తరువాత విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. కానీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ ఎస్టీ ఫిర్యాదులను ఎస్సీ ఎస్టీ కేసులు కట్టకుండా రాజీలు చేస్తుందన్నారు. కొంతమంది పోలీస్ ఆఫీసర్లు ఎస్సీ ఎస్టీ బాధితులపై కౌంటర్ కేసులు నమోదు చేసి బాధితుల్ని బెదిరిస్తున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ అమెండ్మెంట్ యాక్ట్ జీవో ఎంఎస్ నెంబర్ 95 ప్రకారం 3(2)(వి11) పబ్లిక్ సర్వంట్ ప్రకారం పోలీస్ అధికారులు శిక్షార్హులు అవుతారన్నారు. గతంలో కూడా తాళ్లూరు పోలీస్ స్టేషన్ లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులను అవమానించి కులం పేరుతో దూషించి బెదిరించిన ఘటనలో కూడా తాళ్లూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయలేదన్నారు. తాళ్లూరు మండలంలో అగ్రకుల ఆధిపత్యం ఫ్యాక్షనిజం ఎక్కువగా ఉన్నప్పటికీ ఎస్సీ ఎస్టీలపై దౌర్జన్యాలు కుల వివక్ష ఫిర్యాదులు వస్తున్నా కానీ తాళ్లూరు ఎస్సై కేసులు కట్టడం లేదన్నారు. అధికార తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ సూచనలతో ఎస్సీ ఎస్టీ చట్టాలకి తూట్లు పొడుస్తూ భూములు స్థల వివాదాలు లలో తహసీల్దార్ రిపోర్టు మేరకు కేసులు కడతామని పోలీసులు దేశం ఖాకి కథలు చెబుతున్నారన్నారు. గతంలో తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలపాలెం మరియు గ్రామాలలో దళితుల భూముల ఆక్రమించుకున్న అగ్రకుల వైయస్సార్సీపి భూస్వాముల పై కూడా కేసులు నమోదు చేయకపోతే నెలల తరబడి బాధితులను వేధించారన్నారు. తాము ఆందోళన చేసి న్యాయపోరాటంతో ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయించామన్నారు. అలాగే బుధవారం తాళ్లూరు పోలీస్ ముందు విట్లాపురం యానాదుల ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని భూకబ్జా కు పాల్పడిన బీసీ కులానికి చెందిన కురిచేటి శ్రీను కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలని ఆందోళన చేశామన్నారు. అంతట దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ దళిత నేత నీలం నాగేంద్రరావుకు ఫోన్ చేసి జిల్లా ఎస్పీ గారితో మాట్లాడానని తాళ్లూరు ఎస్సై ఎస్సీ ఎస్టీ ఎఫ్ఐఆర్ ఇస్తారని తెలిపారు. అంతట తప్పనిసరి పరిస్థితులలో చట్ట ప్రకారం తాళ్లూరు ఎస్సై మల్లికార్జునరావు క్రైమ్ నెంబర్ 42/26 ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి సదరు కాపీని నీలం నాగేంద్రరావు సమక్షంలో బాధితులకు అందజేశారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్లో యానాదులు పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసు ప్రథమంగా రిజిస్టర్ అయినదన్నారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య ఆధ్వర్యంలో తాళ్లూరు పోలీస్ స్టేషన్ ముందు జరిగిన ఆందోళనలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి యానాది పరిరక్షణ సమితి నాయకులు కోలా జివరత్నం, మేకల ఆదినారాయణ, మాదిగ పరిరక్షణ సమితి నాయకులు పట్రా బంగారం, బొమ్మల వంశీ ఎమ్మార్పీఎస్ నాయకులు అనుపర్తి ఆదాము, డిబిఆర్సి ప్రతినిధి కావూరి నాగమణి తదితరులున్నారు.

## ఘనంగా డాక్టర్ షేక్ వలి సాహెబ్ జయంతి వేడుకలు
## డాక్టర్ షేక్ వలి సాహెబ్ ఆశయాలను కొనసాగించాలి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 3)

సీనియర్ పాత్రికేయులు, పేదల పక్షపాతి స్వర్గీయ డాక్టర్ షేక్ వలి సాహెబ్ జయంతి వేడుకలను యర్రగొండపాలెంలో ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో జర్నలిస్ట్ మిత్రులు హాజరయ్యారు. ముందుగా ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో వలి సాహెబ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని సన్ జో సేవాలయంలో మానసిక వికలాంగుల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యలు తన సమస్యలుగా భావించి కలంతో వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేశారని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి, పఠాన్ రసూల్ ఖాన్, ఉప్పలపాటి యేసేబు అన్నారు. పాత్రికేయ రంగంలో ఎన్నో ఏళ్లుగా విశిష్ట సేవలు అందించిన డాక్టర్ వలి సాహెబ్ ను నూతంగా వచ్చే యువ జర్నలిస్ట్‌లు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జర్నలిస్ట్‌లకు మెలుకువలతో పాటు పత్రిక నైతిక విలువలను సైతం అయన ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే వారన్నారు. వృత్తి పరంగానే కాకుండా వ్యక్తి పరంగా ఇబ్బందులు, సమస్యలు తలెత్తినప్పుడు నేనున్నానంటూ అండగా నిలిచారాని గుర్తు చేసుకున్నారు. పాత్రికేయ మిత్రులకే కాకుండా తమ సమస్య పరిష్కారించాలని తలుపు తట్టిన పేద ప్రజలకు సైతం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేసేవారన్నారు. పాత్రికేయ రంగంలో ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు షేక్ బాజీ, గర్నేపూడి కోటేష్, షేక్ రవూఫ్, సిద్దేల నాగేష్, తప్పెట్ల కోటేశ్వరరావు, మారపాకుల చిన్న ఆంజనేయులు, ఆవుల ఏసు బాబు, కంచి బాల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులను ఆదుకోండి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి

**మంత్రి అచ్చెంనాయుడుని కోరిన ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల**

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 3)

ఈ ఏడాది పొగాకుకు గిట్టుబాటు ధరలేదు. కనీసం పెట్టుబడులు కూడా రావేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంది. కందుకూరు ప్రాంత రైతుల ఆవేదనను మీ దృష్టికి తీసుకు వస్తున్నాం. వారికి న్యాయం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోండి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెంనాయుడును కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడలో మంత్రిని ఎమ్మెల్యేలు కలిసి పొగాకు రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఏడాది మార్కెట్ ధరలు, వ్యాపారుల మందకొడి కొనుగోళ్లు, రైతుల పెట్టుబడి, దిగుబడి, ఇంకా పలు అంశాలను మంత్రికి వివరించారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. మంత్రి అచ్చెంనాయుడు స్పందిస్తూ ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పొగాకు రైతుల సమస్యల పై అధికారులతో భేటీ జరగబోతోందని వెల్లడించారు. రైతులను తప్పక ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు విషయంలో వైసిపి నేతలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తాము చిత్తశుద్ధితో రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు.



# ఎస్సీ డ్వాక్రా గ్రూపు సభ్యులకు
# సబ్సిడి రుణాల చెక్కులు పంపిణీ

## చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్









(షణ్ముఖ వెలుగు, సంతనూతలపాడు, జూన్ 3)

సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని 28 మంది ఎస్సి డ్వాక్రా గ్రూప్ సభ్యులకు పీఎం అజయ్ పథకం కింద ఎస్సి కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు ద్వారా మంజురైనా 30,50,000 లక్షల రూపాయల చెక్కులు ఒంగోలులో మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర మంగళవారం సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని 28 మంది స్వయం సహాయక సంఘంలోని యస్సి లబ్ధిదారులకు మంజురైన యస్.సి కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన ఉన్నతి వడ్డీలేని రుణం రూ.32,50,000ల చెక్కును తిమ్మసముద్రం గ్రామానికి చెందిన కంచర్ల దుర్గా కు రూ.3 లక్షలతో ఎస్సి కార్పొరేషన్ ద్వారా మంజురైనా ఆటోను ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించి అందజేశారు. సమాజంలోని షెడ్యూల్డ్ కులాల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం అజయ్ పథకం ద్వారా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్లు, చిన్న వ్యాపారాలు, సేవా రంగ కార్యకలాపాలు, వ్యవసాయ అనుబంధ ఉపాధి కార్యక్రమాల కోసం ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. బ్యాంకు రుణంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా మంజూరు చేయబడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మన్నం ప్రసాద్, మద్దిపాడు మండల సీనియర్ టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్‌ఆర్), ఏపీఎంలు కాకుమాను సుబ్బారావు, బాబురావు, రాజ్యలక్ష్మి, పార్లమెంట్ సెక్రటరీ దార్ల రామారావు, మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండవ జయంత్ బాబు, మార్నెని రాఘవ, ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గాభవాని, తెలగాతోటి జాన్సన్, నన్నూరి శ్రీనివాసరావు, గోళ్ళ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# మెప్మాతో మహిళల అభివృద్ధి సాధ్యం



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 3)

పట్టణంలోని మెప్మా ద్వారా సభ్యురాలుగా ఉన్న స్టాలిన్ ఇండియన్ బ్యాంక్ లింకేజ్ సహకారంతో టైలరింగ్ యూనిట్ ను ప్రారంభించారు. ఈ యూనిట్ ను బుధవారం సిఎంఎం సత్యవతి, సిఓ శ్రీలతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెప్మా ద్వారా మహిళల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. మహిళలు ఆర్థిక ఎదుగుదలకు మెప్మా దోహదపడుతుందని వారు తెలియజేశారు. మెప్మాలోని మిగిలిన సభ్యులు కూడా ఇదే విధంగా బ్యాంకు లింకేజ్ ద్వారా రుణం పొంది యూనిట్‌ను ప్రారంభించి తిరిగి బ్యాంకుకు సకాలంలో చెల్లించాలని అప్పుడే మరింతగా బలపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 3)

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. ఈ నెల 7 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ, ఏర్పాట్ల పై స్థానిక కలెక్టరేట్లో బుధవారం జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్, విద్యాశాఖలు వీటి పై ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా యోగా గురించి విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యోగా కార్యక్రమాలను పెద్ద ఎత్తున జయప్రదం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డీఆర్వో వెంకటశివరామిరెడ్డి, గనులశాఖ జిల్లా అధికారి రవిప్రసాద్, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, మైక్రో ఇరిగేషన్ పీడీ జెన్నెమ్మ, జిల్లా పౌర సరఫరాల అధికారి అంకయ్య, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, డీఎల్‌డిఓ బాలు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్విజ్ పోటీలు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 3)

చిన్నగంజాం శాఖా గ్రంథాలయం నందు వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీ మోహన నరసింహాచార్యులు అధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రిసోర్స్ పర్సన్లు వై రామాంజనేయులు, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్ నరసింహారావు, పి శ్రీనివాసరావులు బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీ మోహన నరసింహాచార్యులు, రిసోర్స్ పర్సన్లు వై రామాంజనేయులు, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్ నరసింహారావు, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పంట పొలాలకు ముంపు లేకుండా పటిష్ట చర్యలు

### వాగుల పూడికతీత, సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

### డ్రైనేజీ అధికారులతో ఎమ్మెల్యే ఏలూరి సమీక్ష



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 3)

రానున్న వర్షాకాలంలో పంట పొలాలు ముంపునకు గురికాకుండా అవసరమైన అభివృద్ధి పనులను ముందస్తుగా చేపట్టి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డ్రైనేజీ శాఖ అధికారులను ఆదేశించారు. వాగుల పూడికతీత, కాలువల విస్తరణ, మరమ్మతు పనులను వేగవంతం చేసి ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. బుధవారం పర్చూరులోని క్యాంపు కార్యాలయంలో డ్రైనేజీ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వాగుల అభివృద్ధి, పూడికతీత పనుల కోసం సిద్ధం చేసిన అంచనాలు (ఎస్టిమేట్లు), ప్రతిపాదనలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశంలో వాగుల ప్రస్తుత పరిస్థితి, ముంపు సమస్యలు, చేపట్టాల్సిన పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని వాగుల పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అన్ని వాగులను సమగ్రంగా సర్వే చేయించి, అవసరమైన చోట పూడికతీత, కాలువల విస్తరణ,

మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. వర్షాకాలంలో పంట పొలాలకు ఎలాంటి నష్టం జరగకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వాగులకు సంబంధించిన ప్రతి సమస్యను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చూపాలని చెప్పారు. పంట పొలాల రక్షణతో పాటు నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డ్రైనేజీ 1 డీఈఈ డీవీ సుబ్బారావు, ఏఈలు దానియేలు, బి ఆదిలక్ష్మి, కె శ్రీనివాసరావు, డ్రైనేజీ 2 డీఈఈ మల్లికార్జున్, ఏఈలు అరుణకుమారి, బి ఆదిలక్ష్మి, డి అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### గిద్దలూరు నియోజకవర్గ టిడిపి నాయకుడు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 3)

ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకులపై ఉందని గిద్దలూరు నియోజకవర్గ టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి అన్నారు. స్థానిక ముత్తుముల సంజీవరెడ్డి నివాస గృహంలో మండల పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల స్థాయి టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గిద్దలూరు నియోజకవర్గ టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఇంకా ప్రజల్లోకి చేరటం లేదని వాటిని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేర్చాల్సిన బాధ్యత మన పసుపు సైన్యానికి ఉంది అని అన్నారు. ప్రభుత్వము, పార్టీ వేరు కాదని తెలుసుకొని ప్రతి ఒక్క కార్యకర్త మీ పరిధిలోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఒకవేళ మీతో కానిపక్షంలో మండల స్థాయి, నియోజకవర్గస్థాయిలోని నాయకులకు తెలియచేయాలని అన్నారు. మన పార్టీ నాయకులే పార్టీ చేస్తున్న అభివృద్ధిని సంక్షేమ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేస్తే పార్టీ చూస్తూ ఊరుకోదని కావున ప్రతి ఒక్కరూ పార్టీ వేరు, ప్రభుత్వం వేరు అనే భావన పక్కన పెట్టి ప్రతి కార్యకర్త ప్రతి నాయకుడు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే మనకు స్థానికంగా బలం ఉంటుందని రాబోయే ఎన్నికల్లో 14 సర్పంచులు 12 ఎంపీటీసీ స్థానాలను మనం కైవసం చేసుకునేందుకు దోహదపడుతుందన్నారు. త్వరలో జరిగే సర్ అనే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటర్ను మిస్ కాకుండా పరీక్షించి అర్హత ఉన్న ప్రతి ఓటర్ను చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొనేని వెంకటేశ్వర్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు తిరుమలరెడ్డి, షేక్ హసీనా, ఎడమాకల్లు సొసైటీ అధ్యక్షుడు బెజ్జం రవీంద్రనాథ్ రెడ్డి, నాయకులు బీజ్జం వెంకట్రామిరెడ్డి, పులకుర్తి వెంకటేశ్వర్లు, అనప వీరశేఖర్, జ్యోతిరెడ్డి, పులకుర్తి సుబ్బరాయుడు, ముత్తుముల ఎల్లారెడ్డి, లక్ష్మీ నరసయ్య, రామస్వామి, బొడ్డు రంగయ్య, గురుస్వామిరెడ్డి, బద్రి లక్ష్మీ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దు

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జూన్ 3)

హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు, సెక్స్ వర్కర్ల పట్ల వివక్ష చూపకూడదని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పీయూ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మేదరమెట్ల హైవేపై పారిశుధ్య కార్మిక మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు, కండోమ్ వినియోగంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం ఏఆర్టీ కేంద్రాల ద్వారా ఉచిత మందులు అందిస్తోందని, చికిత్సను మధ్యలో నిలిపివేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ బి దుర్గా సురేంద్ర, ఎంఈఏపీ మహేష్, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఔట్రీచ్ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



# చెత్త వాహనాలను ప్రజలందరూ వినియోగించుకోవాలి

## ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి






(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 3)
ప్రభుత్వం చెత్తను తరలించేందుకు ఎంతో కృషి చేస్తూ నూతన వాహనాలను ఏర్పాటు చేసిందని దీనిని పట్టణ ప్రజలందరూ వినియోగించుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు మంజూరైన చెత్తను స్వీకరించే బండ్లను ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద ఉన్న వ్యర్థాలను ఈ బండ్లకు తరలించి ఊరి బయట పారవేయాలన్నారు. ప్రభుత్వం ఎంతో ఖర్చుపెట్టి ఈ వాహనాలు సమకూర్చిందని, దీన్ని సమర్థవంతంగా ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి నాయక్, ఎంపీడీవో బాల చెన్నయ్య, మండల కన్వీనర్ శ్రీను, సొసైటీ బ్యాంక్ చైర్మన్ రామాంజిరెడ్డి, నాసర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

## ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 3)
ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జిలతో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు కేటాయించి అనేక పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం రూ.100 కోట్లకు పైగా వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. అలాగే రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.18 కోట్లకు పైగా సీఎం సహాయనిధి అందించి అనేక కుటుంబాలకు ఉపశమనం కల్పించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే అన్నారు. సీజీఎఫ్ కింద రూ.20 కోట్ల నిధులతో దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో 24 దేవాలయాల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. వ్యవసాయాభివృద్ధికి సాగునీటి వసతులే కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే, కాలువల ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించినట్లు చెప్పారు. వరద





కాలువల ఆధునికీకరణకు రూ.100 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకురావడానికి రూ.95 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా నాయకులు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.

# ఆలయాల అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరిన ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 3)
ఏపీ సెక్రటరియేట్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడిని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకారం అందించాలని, నిర్మాణంలో ఉన్న ప్రాచుర్యం పొందిన ఆలయాల అభివృద్ధికి సిజీఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఆలయాల్లో సేవలు అందిస్తున్న పూజారులకు దూపదీప నైవేద్యం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వాటిని పరిష్కారం చేస్తామని తెలిపారని ఎమ్మెల్యే తెలిపారు.

# మార్కాపురం ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే కందుల









(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 3)
మార్కాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, వాటన్నిటిని సరి చేసి ప్రైవేటు హాస్పిటల్‌కు దీటుగా వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, హాస్పటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వంట నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ








(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 3)
స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, సహాయకులకు బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని, వంటల పోటీలను నిర్వహించారు. టాటా ట్రస్టు సహకారంతో విజయవాహిని చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ వారు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, పత్తి.శ్రీనివాసులు హాజరై కుక్ కం హెల్పర్లకు ఆహార నాణ్యత,పరిశుభ్రతలపై సూచనలు ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎండిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.రాజ లీలావతి వంట నిర్వాహకులకు ఆహార బలవర్ధకత,నాణ్యతా ప్రమాణాలను గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్లస్ ఎఫ్ గుర్తు ఉన్న ఉప్పు, నూనె, నిత్యావసర సరుకులు వినియోగించడం ద్వారా పోషకాహార లోపాలను నివారించవచ్చునీ, మధ్యాహ్న భోజన నిర్వహణలో రుచి, నాణ్యత, పరిశుభ్రతలకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వంటపోటీలలో ప్రతిభ చూపిన నిర్వాహకులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, పత్తి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వీరనారాయణ, సిఆర్పీలు అనురాధ, మురళీమోహన్, రవీంద్ర నాయక్, డేటా ఆపరేటర్ వై శేఖర్, మండల సమన్వయకర్త చిన్ని, పద్మావతి, మండల అకౌంటెంట్ రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com